క్లుప్తంగా

సాగునీరు సరఫరా చేయాలి

మంత్రి జోగి రమేష్



మైలవరం: మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం కవులూరు రైతులకు పోలవరం, తారకరామా ఎత్తిపోతల పథకం ద్వారా నీరు సకాలంలో రైతులకు సరఫరా చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఇరిగేషన్ అధికారులకు సూచించినట్లు జి.కొండూరు జెడ్పీటీసీ సభ్యుడు జక్రధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.కొండూరు మండలం కవులూరు రైతులు వైఎస్సార్ సీపీ నాయకుడు ఈలప్రోలు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడ మంత్రి జోగి రమేష్ కార్యాలయంలో తమ సమస్యలు వివరించి ఆయనకు వినతిపత్రం అందజేశారని జక్రధరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ ఇరిగేషన్, పట్టిసీమ, తారకరామా ఎత్తిపోతల పథకం అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. కవులూరుతో పాటు వెలగలేరు, పినపాక గ్రామాలకు కూడా సాగునీరు అందించాలని మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. వైస్ సర్పంచ్ నరేంద్రబాబు, నాయకులు వీరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

10 వేల నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

జి.కొండూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో 10 వేల నులిపురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకల్యాణి తెలిపారు. ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ వాల్‌పోస్టర్లను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాలలు, తొమ్మిది ప్రైవేటు పాఠశాలలు, 56 అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక ప్రైవేటు కళాశాలలోని 9,934 మంది పిల్లలకు మాత్రలను అందజేసినట్లు చెప్పారు.

వర్షపు నీరు తరలింపునకు చర్యలు

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రసాద్ నగర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు నిలిచిన నీటిని మళ్లించేందుకు కొండపల్లి మున్సిపాల్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం చర్యలు చేపట్టారు. సమీపంలో ఉన్న హైవే స్థలంలో నిర్మాణాలు చేపట్టడం వలనే నీటి నిల్వలు ఉన్నాయని భావించి సదరు కాంట్రాక్టర్‌తో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని చర్చించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు చేపట్టిన వర్షపు నీరు తరలింపు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, నల్లమోతు ప్రసన్న బోస్, ప్రకాష్, దయాకర్, పండు, విఠల్‌రావు, మేడా రాధ పాల్గొన్నారు.

పరీక్ష అట్టల వితరణ

తిరువూరు: మండలంలోని ఎర్రమాడు ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు ఒక దాత శుక్రవారం పలకలు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నాళ్ల పండు జన్మదిన సందర్భంగా పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

తిరువూరు: స్త్రీ శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పట్టణంలోని పలు వార్డులలో శుక్రవారం పంపిణీ చేశారు. మూడో వార్డులో నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, రెండో వార్డులో వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి, 9, 12, 15,19,20 వార్డులలో కౌన్సిలర్లు మూడు దుర్గా, మోదుగు ప్రసాద్, ఇనపనూరి చిన్నారి, మోదుగు ప్రసాద్, పరసా సత్యనారాయణ, షేక్ నదియా అందజేశారు.

ఎన్‌లైజర్‌తో పాల సేకరణ

చాట్రాయి: ఎన్‌లైజర్‌తో కచ్చితమైన పాల సేకరణ జరుగుతుందని మండలంలోని పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ తెలిపారు. గ్రామంలోని పాల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్‌లైజర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల సేకరణ డేటా, పరిమాణం, నాణ్యత, వెన్నశాతం పాడి రైతులకు వెంటనే తెలుస్తుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తిరువూరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి, పాలకేంద్రం అధ్యక్షుడు పర్వతనేని వెంకట గంగ సుబ్బారావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా లక్ష్యం

కొణిజెర్ల(గంపలగూడెం): ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా చేయడమే జల జీవన్ మిషన్ లక్ష్యం అని జిల్లా పథకం పర్యవేక్షణ కేంద్రం ప్రాజెక్టు మేనేజర్ రామశేషచార్యులు తెలిపారు. గంపలగూడెం మండలం కొణిజెర్లలో శుక్రవారం హర్‌ఘర్ జల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకంలో ఉచితంగా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్, అవసరం ఉన్నప్రాంతంలో పైపులైన్ వేయించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో 1400 మీటర్ల మెయిన్‌లైన్, 600 మీటర్ల సబ్ వాటర్ పైపులైన్లు వేశారు. సెక్రటరీ విజయవర్ధన్, డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్లు రామకృష్ణ, నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చిన్నబ్బాయి, నీరు–పారిశుద్ధ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో ప్రజలకు మేలు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎమ్మెల్యే తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ చిన్న ధ్రువపత్రం కావాలన్నా ప్రజలు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారన్నారు. ఇలాంటి కష్టాలను తొలగించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 92,084 కుటుంబాలకు చేరువ కాగా, 64,677 సర్టిఫికెట్లను అందజేశామన్నారు. అంతేగాకుండా అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందకుండా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వ పథకాలు రాని వారి నుంచి కూడా అర్జీలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. వారందరి సమస్యలను పరిష్కరించి అర్హులకు పథకాలను అందిస్తామన్నారు. ప్రజలందరూ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారని, ఈ విషయం జగనన్న సురక్ష కార్యక్రమంలో తేటతెల్లమైందన్నారు. అవసరమైన వారందరూ సురక్ష కార్యక్రమాల్లో వారికి కావాల్సిన సర్టిఫికెట్లను ఉచితంగా అందుకున్నారన్నారు. ఎక్కడా కూడా వ్యతిరేకత ప్రజల్లో కనిపించలేదన్నారు. దీనిని చూసి టీడీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారన్నారు. కొందరు నాయకులు ఏం మాట్లాడాలో తెలియక విచక్షణను కోల్పోయి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో కూడా రాష్ట్ర ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ పాల్గొన్నారు.



నూజివీడులో పోషకాహార కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నూజివీడు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే వెల్‌బేబీ షో, అన్నప్రాసన కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం, రక్తహీనతను నివారించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇంటి వద్దకే రేషన్‌ను అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో 1540 మంది గర్భిణులు, 1,295 మంది బాలింతలున్నారన్నారు. చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు కలిపి నెలకు రూ.66 లక్షలు, ఏడాదికి రూ.8 కోట్ల విలువైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతటి పౌష్టికాహారంతో కూడిన మెనూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు కావడం లేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుల పిళ్లా చరణ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు రాము ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, సీడీపీఓ ఎస్‌వై నూరాని పాల్గొన్నారు.

వందల కిలోమీటర్లు ప్రయాణించి పింఛన్ అందజేత



హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రీలత

జి.కొండూరు: పొరుగు రాష్ట్రాల్లో వైద్య సేవలు పొందుతున్న లబ్ధిదారులకు పథకాలు అందించేందుకు వలంటీర్లు వందల కిలోమీటర్లు ప్రయాణించడానికి కూడా వెనుకాడడంలేదు. జి.కొండూరు గ్రామానికి చెందిన రేతినేని శ్రీనివాసరావు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న రూ.10వేలు పింఛన్‌ను గత నెలలో నూతనంగా అందుకున్నాడు. కాగా అతనికి వ్యాధి తీవ్రమవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రిలో ఇటీవల చేర్పించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు ఈ నెల పింఛన్‌ను గ్రామానికి వచ్చి అందుకునే అవకాశం లేదు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ నెల పింఛన్‌ను తర్వాతి నెలలో ఇచ్చే అవకాశం లేకపోవడంతో బాధితుడికి పింఛన్‌ను అందించాలనే సంకల్పంతో, వలంటీరు శ్రీలత హైదరాబాద్ వెళ్లి శుక్రవారం ఉదయం రూ.10 వేలు పింఛన్‌ను అందజేశారు.

ఆకట్టుకున్న నాటికలు



నాటకోత్సవాల్లో ప్రదర్శించే తథాబాల్యం నాటిక ట్రైల్‌రన్‌గా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం 2023 అక్టోబర్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న నంది నాటకోత్సవాల్లో పాల్గొనేందుకు నిర్ణయించిన రెండు నాటికలను కొండపల్లి డీఏవీ పాఠశాలలో శుక్రవారం ట్రైల్ రన్‌గా ప్రదర్శించారు. ఎన్టీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు నేటి విద్యార్థుల తల్లిదండ్రుల మనస్తత్వాలు ప్రతిబింబించేలా ప్రదర్శించిన ‘ఎనిమి’ నాటిక ఆకట్టుకుంది. ప్రసాద్, కొండపల్లి అప్పారావు తమ పాత్రల్లో జీవించారు. డీఏవీ పాఠశాల విద్యార్థులు పెద్దలు చేసే తప్పులు పిల్లలకు అలవాటుగా మారతాయనే ఇతివృత్తంతో ‘తథాబాల్యం’ సాంఘిక నాటిక ఆలోచింప చేసింది. విద్యార్థులు బి.సాయి, మణికంఠ, తదితరులు తమ పాత్రలకు జీవం పోశారు.

పత్తి, మామిడి రైతులకు అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, శాస్త్రవేత్తలు

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడులో శుక్రవారం గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పత్తి, మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడిలో ఎండు పుల్లలు తొలగించడం, కొమ్మలను కత్తిరించడం, ఎరువుల యాజమాన్యం సస్యరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఎస్.కృష్ణంరాజు మాట్లాడుతూ మామిడి తోటలో తేనెమంచి పురుగు నివారణకు వేప నూనె 1500 పీపీఎం ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, ఆకులపై ఉన్న మసి తెగులు నివారణకు రెండు కిలోల గంజి పొడిని నాలుగు లీటర్ల నీటిలో కలిపి ఉడికించిన దానిని 100 లీటర్ల నీటిలో కలిపి ఎండ అధికంగా ఉన్నప్పుడు పిచికారీ చేసి మూడు రోజుల తర్వాత నీటిని మాత్రమే పిచికారీ చేయాలని అవగాహన కల్పించారు. పత్తి పంటలోపచ్చదోమ, పేనుబంకవంటి రసం పీల్చేపురుగు నివారణకు ఫ్లోనికామైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలోకలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.రాజశేఖర్, కే లక్ష్మీ కళ, జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచ్ మొర్ల లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, మొర్ల సాంబయ్య, మరీదు వెంకటనారాయణ, వీహెచ్‌ఏఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



దర్గాలో మొక్కలు నాటుతున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక షాబూఖారీ మసీదు పీఠాధిపతి మహ్మద్ ఆల్తాఫ్‌రజా మాతృమూర్తి జ్ఞాపకార్థం వివిధ రకాల పండ్ల మొక్కలు శుక్రవారం ఆయన నాటారు. పండ్ల మొక్కలు నాటడం ద్వారా పదిమందికి ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. అనంతరం లంగర్ ఖానాలో అన్నదానం ప్రారంభించారు. కమిషనర్ వెంకటేశ్వర్లును సత్కరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



మైలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

మైలవరం: మొక్కలు నాటి పర్యావరణం కాపాడుకోవాలని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. రత్నదుర్గ తెలిపారు. మైలవరం శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం హరిత భారత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ రత్నదుర్గ జెండా ఊపి ప్రారంభించారు. మొక్కల వలన స్వచ్ఛమైన గాలి, ఆహారం, పేపరు పలు రకాల వస్తువులు తయారీ తదితర ఉపయోగాలు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వీజీఎం మురళీకృష్ణ, ఆర్‌ఐ వినోద్, డీన్ శ్యాంసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు హైస్కూల్ తనిఖీ



ముసునూరు: నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ శుక్రవారం ముసునూరు హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ముందుగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగంపై సమగ్ర పరిశీలన చేశారు. పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించి, 10కి 10 గ్రేడులను అందరూ సాధించాలని కోరారు. హైస్కూల్ ప్లస్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, క్రమశిక్షణ, కఠోర దీక్షతో ఉన్నత విద్యాభ్యాసం చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారమే ఆహార పదార్థాలను రుచిగా శుచిగా వండి విద్యార్థులకు వడ్డించాలని హెచ్‌ఎం సునీలకు సూచించారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు.

విద్యుదాఘాతానికి పాడి గేదె మృతి

చాట్రాయి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన ఇది. మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన చింతా ఏసుకు చెందిన పాడి గేదె శుక్రవారం మేతకు వెళ్తుండగా కోటపాడు రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో సుమారు రూ.60 వేలు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

కూరగాయలతో ఆరోగ్యం కాపాడుకోవాలి



దాసుళ్లపాలెంలో ఆకు కూరల విత్తనాలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

చంద్రగూడెం(మైలవరం): ప్రతిఒక్కరూ సహజ సిద్ధంగా పండించిన కూరగాయలతో ఆరోగ్యం కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజక్టు మేనేజర్ విజయకుమారి తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మైలవరం మండలం చంద్రగూడెంలోని రైతు చక్రధర్ పండించిన నవధాన్యాల పంటను పరిశీలించారు. రసాయనిక ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకు కూరలు తినకుండా, తమ ఇంట్లోనే సహజ సిద్ధంగా పండించిన కూరగాయలు, ఆకు కూరలు తిని ప్రతి మహిళా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మైలవరం మండలం చంద్రగూడెంకు చెందిన దేవరకొండ చక్రధర్ పండించిన ప్రీ మాన్‌సూన్ అండ్ డ్రై సోయింగ్ పొలాన్ని పరిశీలించి పంట కోత ప్రయోగం చేశారు. అనంతరం దాసుళ్లపాలెం గ్రామానికి చెందిన వెంకయ్య 20సెంట్ల పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆకు కూరలు పండించేందుకు ముందుకు రావడంతో 18 రకాలు పంటలు వేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది అంజిరెడ్డి, రవి, సింధు, బెంజమన్, ఇన్‌చార్జి శాంతికుమారి పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే ఉంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని, గత టీడీపీ ప్రభుత్వానికి ఇపుడు ఉన్న జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని కోరారు. గృహ సారథులు, మండల సచివాలయాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ పుచ్చకాయల సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జగన్‌మోహనరావు, సర్పంచ్ హైమావతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకుడుకారంగుల వాసు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆగిరిపల్లి (నూజివీడు): ప్రజలు తమ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేంద్రకృష్ణ సూచించారు. మండలంలోని ఈదరలో శుక్రవారం డ్రైడే ర్యాలీ నిర్వహించారు. సబ్‌యూనిట్ అధికారి యలమంద, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు అభివృద్ధిని చూడలేకపోతున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న స్వరూపరాణి

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను టీడీపీ నాయకులు కళ్లుండి కూడా చూడలేకపోతున్నారని రాష్ట్ర హిస్టరీ అకాడమి డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణి పేర్కొన్నారు. నూజివీడులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలువురు కౌన్సిలర్లతో కలిసి ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే పురోగతి నెలకొందన్నారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నాడని స్వయనా ప్రధాని నరేంద్రమోదీనే పేర్కొన్నారన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను అప్పులపాలు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.500 చెల్లించి ప్లాట్లు పొందిన వారికి రుణాన్ని మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు వద్దకు ఇతర పార్టీల వారు వచ్చినా పనిచేసి పెట్టి పంపించే వ్యక్తిత్వం కలిగిన వారని, ఆ విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలిసినా కొందరు టీడీపీ మహిళా నాయకులకు తెలియకపోవడం వారి అజ్ఞానానికి నిదర్శమన్నారు. ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి టీడీపీ నాయకులకు ప్రజలు గుర్తుకువచ్చారని, ఈ నాలుగు సంవత్సరాలుగా ఎక్కడ ఉన్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, కౌన్సిలర్లు గాదెరెడ్డి శ్రీలత, కళ్లేపల్లి ప్రియాంక, షేక్ రజియాబేగం, ఆర్.సుజాత, మాజీ కౌన్సిలర్ మద్దాల రూత్‌మేర్సీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఉషాబాలానగర్, మైలవరం రోడ్డు, శ్రీనివాసా సెంటర్, స్టేషన్‌తోట, ఐదు బజార్ల సెంటర్, ముస్లిం బజార్, అజరయ్యపేట, ఢంఢం గార్డెన్, నటరాజ్ ప్రెస్ ఏరియా, భువనగిరి పేట, సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

రెండు ట్రాక్టర్ల సీజ్

గంపలగూడెం: నిబంధనలకు విరుద్ధంగా కట్టలేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై ఎస్సై రాంబాబు శుక్రవారం దాడిచేశారు. కనుమూరు రేవులో రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా లోడ్ చేసుకుంటుంగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

నూజివీడు: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఏపీసీపీడీసీఎల్, ఉపాధి హామీ పథకం, విద్యాశాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. ఈ సమావేశానికి ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ, డీఈఓలు హాజరవుతారని పేర్కొన్నారు.